ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలన

- జోగన్నపాలెంలో రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు
- త్వరలో అందుబాటులోకి స్వచ్ఛమైన తాగు నీరు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి



జోగన్నపాలెంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



జోగన్నపాలెంలో ఎమ్మెల్యే అబ్బాయి చౌదరికి, ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు ఘన స్వాగతం పలుకుతున్న గ్రామ ప్రజలు

దెందులూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదర్శవంతమైన పాలన అందించిందని ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. జోగన్నపాలెం బుధవారం దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిట్టా గాంధీ, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యేకు అడుగడుగునా జననీరాజనాలతో స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి పోస్టర్లను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఎంపీ కోటగిరి శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించినట్టు తెలిపారు. ప్రతి గ్రామాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దేందుకు వైఎస్సార్ సీపీ అడుగులు వేస్తుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.2,800 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. జోగన్నపాలెంలో రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కుల, మత బేధాలు, పార్టీలతో అతీతంగా సంక్షేమ పథకాలు అందించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందించామన్నారు. ఇంకా అర్హులుంటే గుర్తించి వారికి కూడా ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. మంచినీటి సదుపాయం కోసం నూతన పైపులైన్లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా మరెన్నో హామీలను నెరవేర్చారన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు, నాలుగున్నరేళ్లల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించి అమలు చేశారన్నారు.

ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన సీఎం జగన్

ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని అన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు నిత్యం అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వివిధ కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధిని, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి జగన్ చేసి చూపించారన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి నిత్యం ప్రజల్లో ఉంటూ నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ప్రజలందరూ కూడా వచ్చే ఎన్నికల్లో అబ్బయ్య చౌదరిని అధిక మెజారిటీతో గెలిపించి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, వైస్ చైర్మన్ పీ.విజయ్‌బాబు, ఎంపీపీలు పెన్మెత్స శ్రీనివాసరాజు, తాతా రమ్యశ్రీ, బత్తుల రత్నకుమారి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, వైస్ చైర్మన్ కాటి సుధాకర్, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, విజయవాడ కనకదుర్గమ్మ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జిల్లా బీసీ కమిటీ సభ్యులు పోకల రాంబాబు, గుత్తా ప్రసాద్, పెదవేగి మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు, దెందులూరు మండల సచివాలయాల కన్వీనర్ కట్టా ఏసుబాబు, సర్పంచులు పర్వతనేని శ్రావణిసుధీర్, బోదుల స్వరూప్, కోటే నాగమల్లేశ్వరి కుమార్, చిలకా వెంకట సుబ్బారావు, బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, యలమర్తి రేవతి రామకృష్ణ, మెండెం సంతోష్‌కుమార్, కూరపాటి ప్రభుదేవా, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు



భీమడోలు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎస్పీ మేరి ప్రశాంతి

భీమడోలు: ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటోందని ఏలూరు ఎస్పీ మేరి ప్రశాంతి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఎస్పీ భీమడోలు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. భీమడోలు సీఐ బీబీ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గౌరవ వందనం చేసారు. అనంతరం ఎస్పీ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులపై అలసత్వం వహించవద్దని సూచించారు. పోలీసులకు పలు సూచనందించారు. అనంతరం ఎస్పీ మేరి ప్రశాంతి మాట్లాడుతూ భీమడోలు సర్కిల్ పరిధిలోని జాతీయ, రాష్ట్రీ రహదారుల విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందున రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్నందున నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో రోడ్డు ప్రమాదాలను అదుపులోకి తీసుకుని రావడం ద్వారా ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దవచ్చునన్నారు. ప్రతి ఇంటా ఆనందాల దీపావళిను జరుపుకోవాలని, అనుమతులు లేకుండా బాణ సంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాణ సంచా కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్సైలు చావా సురేష్‌కుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.50 కోట్లతో రహదారి నిర్మాణం



నిర్మాణం పూర్తయిన పోతునూరు- కేదవరం రోడ్డు

దెందులూరు: పోతునూరు నుంచి కేదవరం వెళ్లాలన్నా, కేదవరం నుంచి పోతునూరు రావాలన్నా దశాబ్దాలుగా రెండు గ్రామాల ప్రజలు చూస్తున్న నరకానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మోక్షం కల్పించారు. ఆయా గ్రామాల ప్రజలు అన్ని అవసరాలు చూసి రూ.3.50 కోట్లతో మంజూరు చేయించి పోతునూరు నుంచి కేదవరం వరకు మూడు కిలోమీటర్ల రోడ్డును వేయించారు. ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు గూడపాటి పవన్‌కుమార్ సొసైటీ చైర్మన్ రమాదేవి డీఎస్పీ ప్రసాద్ (బజ్జి), ఎంపీటీసీ సున్నా నరేష్, డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తలారి రామకృష్ణ, బుద్దా అర్జున, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ రమేష్, కేదవరం, పోతునూరు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బాలల హక్కుల వారోత్సవాల కరపత్రం విడుదల



బాలల హక్కుల వారోత్సవాల కరపత్రం విడుదల చేసిన రాజేంద్ర ప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఈ నెల 8 నుంచి 14 వరకు జరిగే బాలల హక్కుల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జంగం రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక నరసింహారావుపేటలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో ఆయన బాలల హక్కుల వారోత్సవాల కరపత్రం బుధవారం విడుదల చేశారు. ఈ వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలు, అవుట్ డోర్ లెర్నింగ్ సెంటర్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఏలూరు డీబీఆర్‌సీ టీమ్ సభ్యులు బలే సురేష్, గోశాల ఝాన్సీరాణి, సింగవరపు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో లక్ష్యం వైపు సాగాలి



దిశ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి తమ లక్ష్యాలవైపు సాగాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా దిశ పోలీస్ స్టేషన్ల డీఎస్పీ సున్నా మురళీకృష్ణ సూచించారు. స్థానిక అమీనాపేటలోని సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థినులకు దిశ చట్టంపై అవగాహన కార్యక్రమం బుధవారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ కష్టపడి చదివితే జీవిత కాలం అంతా సంతోషంగా, ఆనందంగా ఉండొచ్చన్నారు. టీనేజ్ (13 నుంచి 19 సంవత్సరాలు) ఉన్న విద్యార్థినులు కష్టపడి చదివితే తమ ఆశయాలు నెరవేర్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని వివరించారు. సెల్‌ఫోన్ ఉపయోగించడం వల్ల ఎన్ని లాభాలు ఉన్నాయో, అదే విధంగా జీవితాన్ని నాశనం చేసే నష్టాలు కూడా ఉన్నాయని అన్నారు. ప్రతి ఒక్కరి మొబైల్లో దిశ యాప్ కలిగి ఉండాలని, ఆపద సమయంలో ఎస్‌బీఎస్ బటన్ నొక్కితే 10 నిముషాల్లో పోలీసులు వచ్చి సహకరిస్తారని చేరుకుంటారన్నారు. వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. కళాశాల, పాఠశాల నుంచి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు అపరిచితులతో మాట్లాడకూడదని తమ కుటుంబ వివరాలు తమ వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పొద్దని అన్నారు. సమావేశంలో డీసీపీఓ సూర్యచక్రవేణి, దిశ సీఐ విశ్వం, ఎస్సై కాంతి ప్రియ, బాలల హక్కుల రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విశాఖ ఉక్కు పరిశ్రమని ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఏలూరులోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలను విద్యార్థి సంఘాల నాయకులు మూయించి అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఫైర్ స్టేషన్ సెంటర్లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ ప్రైవేట్ వ్యక్తులైన అంబానీ, ఆదానీలకు అతిచౌకగా కట్టబెడుతోందని విమర్శించారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని నాడు జరిగిన కాల్పుల్లో 32 మంది విద్యార్థులు చనిపోయారని గుర్తు చేశారు. ఏఐఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి, కె.సునీల్, యు.తేజ, పి.యశ్వంత్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

26 నుంచి గుంటూరులో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

దెందులూరు: ఈ నెల 26, 27, 28 తేదీల్లో గుంటూరు జిల్లా నరసరావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి 33వ సబ్‌జూనియర్స్ ఖోఖో పోటీల్లో పాల్గొని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి ఉండ్రాజవరం నుంచి వేలివెన్ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈ.సాంబశివరావు, ఎస్‌వీ రంగారావు అన్నారు. బుధవారం గంగన్నగూడెంలో వారు మాట్లాడుతూ 1.01.2010 తరువాత పుట్టినవారై ఉండాలి, ఎత్తు సెంటీమీటర్లలోపు, బరువు కేజీల్లో మొత్తం 215 పాయింట్లు దాటకూడదన్నారు.

రేపు భీమడోలు మండలపరిషత్ సమావేశం

భీమడోలు: భీమడోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 10వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి బుధవారం తెలిపారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కనమాల రామయ్య అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి అభివృద్ధి పనుల వివరాలతో ఆయా శాఖ అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. లేని పక్షంలో వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

రేపు డయల్ యువర్ డీఎం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు డిపో పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ బి.వాణి ఒక ప్రకటనలో తెలిపారు. సెల్ నెంబర్ 99592 25487కు డయల్ చేసి తమ సమస్యలను తెలపవచ్చని, ఆర్టీసీ అభివృద్ధికి సూచనలు, సలహాలు కూడా ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమౌతుందని తెలిపారు.

ఉప ప్రణాళిక ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): వృత్తుల రక్షణ, సంక్షేమం, సామాజిక భద్రత కోసం చేతి వృత్తిదారులకు ఉప ప్రణాళిక ఏర్పాటు చేయాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, క్షౌర వృత్తిదారుల సంఘం నాయకులు వి.కిషోర్ కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వాన ఏలూరు విచ్చేసిన బస్సు యాత్ర సందర్భంగా ఆయనకు చేతి వృత్తిదారుల నాయకులు వినతి పత్రం అందజేశారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి చేతి వృత్తిదారుని కుటుంబానికి రూ.3 వేలు పింఛన్ ఇవ్వాలని, నగదు బదిలీ పథకం ద్వారా రూ.25 వేలు అందించాలని, చేతి వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని పేర్కొన్నారు.

నేడు అర్ధవరంలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'

గణపవరం: మండలంలోని అర్ధవరంలో ఈనెల 9వతేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు ఏపీకి ముఖ్యమంత్రిగా జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభిస్తారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము తెలిపారు. ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొని, నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరించి, రానున్న కాలంలో అమలు చేయబోయే కార్యక్రమాలను, ప్రజలకోసం అమలు చేయాల్సిన పథకాలను వివరిస్తారని ఆయన తెలిపారు. పార్టీ శ్రేణులంతా ఈకార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

గణపవరం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడపలో స్టీల్‌ప్లాంట్ తక్షణం ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం గణపవరంలోని అన్ని విద్యా సంస్థలను మూసివేశారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ తదితర విద్యార్థి సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. గణపవరంలోని ప్రభుత్వ కళాశాలలు, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను బంద్ నిర్వాహకులు మూయించి వేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకురాలు చిన్నం శాంతి మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవడానికి అందరూ కంకణబద్ధులు కావాలని అన్నారు. రాష్ట్ర విభజనతో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రానికి కడపలో స్టీల్‌ప్లాంట్ ఇస్తానన్న హామీని కేంద్రం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



కైకరంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఉంగుటూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరిచి, కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు గోనె సంచులు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఉంగుటూరు మండలం కైకరం ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన రైతులు, కౌలు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.75 కేజీల బస్తాకు సాధారణ రకానికి రూ.1,637, ఏ గ్రేడ్‌కు రూ.1,652 కాగా దళారులు రూ.1,280 కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. తేమ శాతం పేరుతో రైతులు బస్తాకు రూ.350 నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తేమ శాతం నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. జీపీఎస్ పేరుతో ధాన్యం రవాణాకు తగినన్ని వాహనాలు ఏర్పాటు చేయకపోతే రైతులు ఇబ్బంది పడే అవకాశం ఉందని, రైతుల ట్రాక్టర్లకు జీపీఎస్‌కు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కష్టారావు, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వీడండి



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరూ పని ఒత్తిడి కారణంగా ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇది భవిష్యత్‌లో తీవ్ర అనారోగ్యానికి దారితీస్తోందని ఏలూరు సెంట్రల్ లయన్స్‌క్లబ్ ప్రతినిధి తోట ఎడ్వర్డ్ హెచ్చరించారు. బుధవారం స్థానిక కండ్రికగూడెం సుస్మిత స్లీప్‌వెల్ వద్ద మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు బి.కృష్ణ, కొడాలి రామ్ ప్రసీన్, భాను కిరణ్, నిడదవోలు పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు సుమారు 250 మందిని పరీక్షించి ఉచితంగా రక్త పరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుస్మిత డయోగ్నస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ నవిరామ్, అడపా రాఘవ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను అందజేయాలి

ఏలూరు (టూటౌన్): టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని, లబ్ధిదారుల పేరుతో తీసుకున్న బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. సీపీఎం ప్రజా రక్షణ భేరి రాష్ట్ర బస్సు యాత్రలో భాగంగా ఏలూరులో రెండో రోజు ఏలూరు సమీపంలోని పోణంగిలో నిర్మించిన టిడ్కో ఇళ్లను రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఎ.రవి, నగర కార్యదర్శి పి.కిషోర్ ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు బుధవారం పరిశీలించారు. అనంతరం శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడారు. 2018లో టీడీపీ ప్రభుత్వం అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లను నిర్మిస్తామని ప్రజల వద్ద నుంచి డిపాజిట్ల రూపంలో డబ్బులు వసూలు చేసి, కొంత బ్యాంకు రుణాల ద్వారా తీసుకుని టిడ్కో ఇళ్లు నిర్మించారని గుర్తుచేశారు. ఏలూరులో 18,646 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. నాటి టీడీపీ హయాంలో ఒక్కో లబ్ధిదారు వద్దా రూ.500 నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారని తెలిపారు. ఏలూరులో పోణంగి, కొత్తూరు ప్రాంతాల్లో దాదాపు ఆరువేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయని వీటిని లబ్ధిదారులకు అందించాలని శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, కిళ్లో సురేంద్ర, సూర్యనారాయణ, బి.సోమయ్య, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా విజయ్

ఏలూరు (టూటౌన్): బీజేపీ ఏలూరు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షునిగా కాట్రు విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ నుంచి బుధవారం నియామక పత్రం అందినట్టు విజయ్ పేర్కొన్నారు. విజయ్ గతంలో ఏలూరు జిల్లా ఇంటలెక్చువల్ కన్వీనర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తపన చౌదరి, బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్, బీజేపీ ఓబీసీ మోర్చా జోనల్ కన్వీనర్ లక్కోజు అనిల్ ఆచార్యతో పాటు తన ఎన్నికకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

అసిస్టెంట్ ప్రొఫెసర్ నిర్మల డాక్టరేట్‌కు ఎంపిక



కె.నిర్మల

దెందులూరు: మండలంలోని కొవ్వలి గ్రామానికి చెందిన కొరుకోల నిర్మల డాక్టరేట్‌కు ఎంపికయ్యారని ఆంధ్ర విశ్వవిద్యాలయం బుధవారం ప్రకటించింది. నిర్మల భీమవరం కేజీఆర్ఎల్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె శేషాచలం అడవుల్లోని మొక్కలపై పరిశోధన చేసి వాటి నుంచి టీబీ, డయాబెటిక్, క్యాన్సర్ వ్యాధుల నివారణకు సంబంధించి ఔషధ గుణాలు, వాటితో మందుల తయారీపై పరిశోధించారు. త్వరలో విశాఖపట్టణంలో నిర్వహించనున్న స్నాతకోత్సవంలో నిర్మలకు డాక్టరేట్ ప్రదానం చేస్తారని వివరించారు.

పెట్రోలు బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన



పోతునూరులో పెట్రోలు బంకు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ బీ.లావణ్యవేణి

దెందులూరు: పోతునూరులో పెట్రోలు బంకు నిర్మాణానికి దరఖాస్తు చేసిన స్థలాన్ని బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ బీ.లావణ్యవేణి పరిశీలించారు. స్థలం నాలుగు వైపులా సరిహద్దులు, దారిని చూశారు. రికార్డుల వివరాలు మ్యాప్‌లో చూపించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎస్‌వీ నాంచారయ్య, వీఆర్వో కిషోర్ ఉన్నారు.

భారీ వర్షంతో రోడ్లు జలమయం



గణపవరం- ఏలూరు రోడ్డుపై వర్షం నీరు

గణపవరం: గణపవరం పరిసర ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. చాలా రోజుల తర్వాత బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా, మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి, మబ్బులు కమ్మి, భారీ వర్షం కురిసింది. దాదాపు గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై నీరు చేరి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సార్వా రైతులు వర్షం దెబ్బకు ఆందోళన చెందారు. పంట చేతికి వచ్చే దశలో వాతావరణం మారిపోయి, వర్షాలు కురవడంతో కోతలకు అంతరాయం కలిగి రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొత్తూరు పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



కొత్తూరు ఎంపీపీ పాఠశాలలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ కమిటీ సభ్యులు సత్యనారాయణ

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం గ్రామం ఎంపీపీ స్కూల్ కొత్తూరు స్కూలును జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు కోనే వీర వెంకట సత్యనారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే పౌష్టికాహారంపై సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యత ప్రమాణాలు పెంచాలని సూచించారు. రికార్డులను, స్టాక్‌ను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. టాయిలెట్స్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, వంట చేసే ప్రదేశాలు కూడా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ తనిఖీలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు తోటగూడెంలో పల్లెకు పోదాం

పెదపాడు: తోటగూడెంలో గురువారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎస్ సూర్యకుమార్ తెలిపారు. మండలంలోని తోటగూడెంలో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని చెప్పారు.

9 నుంచి పల్లెకు పోదాం

ఉంగుటూరు : మండలంలో ఈ నెల 9వ తేదీ నుంచి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రేమాన్విత తెలిపారు. ఈ మేరకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. 9వ తేదీ బాదంపూడి, 10వ తేదీ ఎ.గోకవరం, 14వ తేదీ చేబ్రోలు-1, 15వ తేదీ చేబ్రోలు-2, 16వ తేదీ గొల్లగూడెం, 17వ తేదీ గోపాలపురం, 20వ తేదీ గోపీనాథపట్నం, 21వ తేదీ కాగుపాడు, 22వ తేదీ కైకరం-1, 23 తేదీ కైకరం-2 గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.